# పుత్రాదిచ్ఛేత్పరాజయమ్

ఫిల్టర్ కాఫీ రుచి మాటల కందదు. ప్రొఫెసర్ చక్రపాణికి కాఫీ అంటే మహాయిష్టం. నిజానికి ఆపూట కాఫీ మరింత రుచిగా కూడా వుంది. అయినా కాఫీతాగిన అనుభూతి కలగలేదు. పేపరు చదవకపోతే ఏమీ తోచేదికాదు. పైకి మనసు పోవడంలేదు. నిన్నటిదాకా కాఫీ నోట్లో పోసుకోగానే పేపరు కుర్రాడు ఏ కారణం చేతనైనా రావడం ఆలస్యమైతే గంగవెర్రు లెత్తడం ఖాయం. అలాంటిది ఎదురుగా పడివున్న పేపరుపైకే దృష్టిపోవడం లేదు. ఏదో పోగొట్టుకున్నవాడి మాదిరిగా చక్రపాణి వరండాలో పచార్లు చేస్తూ మాటిమాటికి పెదాలు తడుముకుంటున్నాడు. ఆదివారంనాడు చాల రిలాక్సింగ్ మూడ్‌లో వుండవలసింది. ఆ ఛాయలే లేవు. గదిలోకి వెళ్ళి వక్కపొడి వేసుకొచ్చాడు. పేపరు తీసుకుని ఈజీచైర్లో బార్లాపడ్డాడు. అప్రయత్నంగా జేబుతడుముకున్నాడు. సిగరెట్ పెట్టిలేదు. దాన్ని రాత్రి తానే కసితో నలిపి అవతలపారేశాడు. జన్మలో యిక సిగరెట్ ముట్టుకోనని పార్వతికి మాటిచ్చాడు. అంతేకాదు. తమకు ప్రాణంకంటే ఎక్కువైన రాఘవ పైన ఒట్టేసి మరీ వాగ్దానం చేశాడు. రాఘవ ఒక్కగా నొక్క కొడుకు. ఆశలన్నీ అతనిమీదే లగ్నమయ్యాయి. తమ కలలపంట. అతని భవిష్యత్తుకు బంగారుబాట వేయడమే తమ జీవితధ్యేయం అందుకు ఎంతటి త్యాగానికైనా సిద్ధమే

సాధ్యాసాధ్యాల ప్రసక్తి వుండదు. ప్రమాణం తప్పడానికి మనసున సనేమిరా సమ్మతించడంలేదు.

ఇప్పుడెలా? ఉదయం కాగానే ఆలోచలన్నింటిని అదుపుచేసేవి-కాఫి, సిగరెట్, పేపరు. వీటిలో ఏది లోపించినాతలలో ఏదో పుకుగు తొలుస్తున్నట్టుగా వుంటుంది.

కళ్ళు పేపరు వంక చూస్తున్నా వార్తలేమీ అర్థంకావడంలేదు. పేజీలు మాత్రం యాంత్రికంగా తిరగేస్తున్నాడు. క్రితం రాత్రి జరిగిన సంఘటన కళ్ళకు కట్టినట్లయింది.

డైనింగ్ టేబిల్‌మీద రెండు ప్లేట్లలో ఇడ్లీలు పెట్టివున్నాయి. చిన్నగిన్నెలో తన కిష్టమైన మామిడి అల్లం పచ్చడి నోరూరిస్తోంది. పక్కనే చిన్న ప్లేట్లో కాధప్పొడి పైన వేసిన వెన్నకాచిన నెయ్యి ఘుమఘుమలాడుతోంది. రాఘవ అన్నంతిని ప్రయివేటు చెప్పించుకునేందుకు వెళ్ళాడు. మరో గంటకి గాని రాడు. పార్వతి, చక్రపాణి శనివారంనాడు రాత్రిపూట భోజనం చేయరు.

ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు. ప్లేట్లలో ఇడ్లీలు నెమ్మదిగా తరుగుతున్నాయి. పార్వతి ముభావంగా వుండడం చక్రపాణి గమనించాడు. "ఏమిటోయ్! ఇంత బ్రహ్మాండంగా టిఫిన్ తయారుచేసి అలా మాట్లాడకుండా కూర్చున్నావ్! భార్యని కబుర్లలోకి దింపాడు.

నిజానికి టిఫిన్ అవ్వగానే ఒక ముఖ్యవిషయం భర్తతో చెప్పాలనుకుంటోంది. అసలు ఎంతో కాలంగా తనలో తాను మధనపడుతోంది. సిగరెట్ల వల్ల ముంచుకొచ్చే ప్రమాదం గురించి ప్రతిరోజూ పేపర్లు మోసుకొస్తున్న సంగతులు చదివి తల్లడిల్లిపోతోంది. ఎలాగైనా భర్త చేత ఈ పాడు అలవాటు మాన్పించాలని గట్టిగా నిర్ణయించుకుంది. రాఘవలేనప్పుడు ఈ చర్చ జరపాలని కూడా అనుకుంది. ఎలా ప్రారం

భించాలో తెలియక ఆలోచనతో సతమతమవుతూ మౌనంగా వుండి పోయింది భర్తే కబుర్లలోకి దింపడంతో ధైర్యం కూడగట్టుకుంది.

"ఇడ్లీ బావుంటే మరో రెండు వేస్తా" అని కొసరి కొసరి వడ్డించింది.

ఫలహారం అయ్యాక చక్రపాణి సిగరెట్ పెట్టెలోంచి హుషారుగా సిగరెట్ తీసి పెట్టిమీద సుతారంగా కొడుతూ అగ్గిపెట్టి యిలా యివ్వవోయ్ భార్యని అడిగాడు దీర్ఘాలుతీస్తూ.

తన కోరిక ఫలించేందుకు యిదే మంచి అదననుకుంది పార్వతి.

అగ్గిపెట్టి పట్టుకెళ్ళకుండా దగ్గరికెళ్ళి ఒయ్యారంగా భర్త చేతిలోంచి సిగరెట్ లాక్కుంటూ మీరీ అలవాటు వెంటనే మానేయాలండీ! యింగ మూతిపెట్టి నిక్కచ్చిగా చెప్పింది.

సిగరెట్ అందుకోబోతూ అదేమిటి దేవి గారికి అంత సడన్‌గా జ్ఞానోదయమయిందే! ఏం కథ? వెటకారంగా చూశాడు.

పార్వతి చేతులు వెనక్కి పెట్టుకుని గొంతులో గాంభీర్యం నింపుకుని నేనెప్పట్నుంచో పోరుతూనే వున్నాను. మీరే నన్ను పురుగును దులిపినట్లు దులుపుతున్నారు. యింతకాలం ఇకనైనా దీని జోలికిపోకండి అంది.

"ఏం కొంపమునిగిందిపుడు" చిరాకు పడ్డాడు.

పార్వతి ఈ అవకాశాన్ని జారవిడుచుకోదలచలేదు.

"నేనో ప్రశ్నడుగుతాను. సూటిగా సమాధానం చెబుతారా?"

గట్టిగా అడిగింది.

"నస పెట్టక అదేమిటో అడుగు" గొంతు పెంచాడు.

"మీరు ఎప్పటినుంచి సిగరెట్లు తాగడం మొదలు పెట్టారు? కాలేజీలో చేరాకా? స్కూల్లో వుండగా నేనా? అయితే ఎన్నోక్లాసునుంచి? ప్రశ్నలు వాడి బాణాల్లా గుండెల్లో గుచ్చుకుంటున్నాయి.

చక్రపాణి నిశ్చేష్టుడయ్యాడు ఊహించని ప్రశ్నలు, పైగా పార్వతి కంఠంలో కరకుతనం బోన్లో నిలబడ్డవాడిలా "పదో తరగతి నుంచి" జవాబిచ్చాడు.

పార్వతి ఆ సమాధానం విని వుగ్రమూర్తిలా మరింది. అయితే మీ కొడుకు మిమ్మల్ని మించిపోయాడు. తొమ్మిదో తరగతిలోనే మొదలు పెట్టాడు ఈ సడింపుగా అంది గళంలో మార్దవం మచ్చుకైనా లేకుండా.

చక్రపాణికి నెత్తిమీద వందపిడుగులు అగకుండా పడినట్లయింది. తన నెవరో పాతాళానికి విసిరివేసినట్లయింది. నోట మాట రాలేదు. శక్తినంతా కూడగట్టుకుని తెప్పరిల్లాడు.

"నువ్వంటున్న దేవిటి పార్వతీ" గొంతు వణికింది.

చక్రపాణి చేయిపట్టుకుని గబగబా రాఘవ గదిలోకి తీసుకెళ్ళింది. హ్యాంగర్ కున్న చొక్కా తీసి జేబు దగ్గర వాసన చూపించింది. జామెట్రీ బాక్సు తెచ్చి మూతతీసి అందులోంచి సిగరెట్ పైకిలాగిచేతితో నలిపి కిందపడేసి కసితో కాళ్ళతో తొక్కింది. ఠర్త గుండపైతలవాల్చి ఏడ్చింది. సైకాలజీ ప్రొఫెసర్ మీరు ఆ సూత్రం గ్రహించలేకపోయారు. ఏ ముఖం పెట్టుకుని వాణ్ణి మందలించగలరు? మీ కాధైర్యంలేదు. ఎదురుతిరిగి మిమ్మల్ని నిలదీస్తే మీరేం జవాబిస్తారు? బాకుతో పొడిచినట్టున్నాయి. ఆమె మాటలు.

చక్రపాణి యింకేమీ వాదించే స్థితిలో లేదు. రాఘవని నిలదీసే సాహసంలేదు.

"పారూ? ఊరుకో రాఘవమీద ఒట్టేసి చెబుతున్నా.........నేను ఈ జన్మలో మళ్ళీ సిగరెట్ తాగను. నువ్వే వాడికి నచ్చచెప్పివాడిచేత సిగరెట్లు మాన్పించు ఆ మాట తలుచుకుంటేనే నా గుండె బద్దలవు తోంది ప్రాధేయపడుతూ అన్నాడు

రాఘవ ప్రయివేటు నుంచి వస్తున్నట్లు అలికిడి విని గదిలోంచి యిద్దరూ హాల్లోకి వచ్చారు. సంబాళించుకుని.

అదీ రాత్రి సంఘటన. అవును ఎంత కష్టమైనా ఓర్చుకోవాలి. రాఘవ చెడిపోకూడదు. తండ్రిగా ఆ మాత్రం త్యాగానికి సిద్ధపడాలి! చక్రపాణి మనసు సమాధానపరచుకుంటోంది. తాను చేస్తున్న ఈ త్యాగాన్ని చూసి రాఘవ సన్మార్గంలో పడితే అంతకన్నా కావలసిందే ముంటుందని చక్రపాణి మనసు పదేపదే చెబుతోంది. ఈ తర్జన భర్జనలో పేపరు పేజీలు పూర్తయ్యాయి.

చక్రపాణి అవస్థ గమనించి లోపల హాల్లో తల్లీ కొడుకులు నవ్వు కోవడం అతనికి తెలియదు.

అమ్మా! మొత్తంమీద నాన్నని దార్లోకి తెచ్చాలే ఒక్కరోజులో! నాటకం భలే రక్తికట్టింది. నాన్న అటకట్టు కాని నాపైన నాన్నకి అనవసరంగా అపోహకల్పించావ్! అని రాఘవ తల్లితో అన్న మాటలు చక్రపాణికి వినిపించలేదు.

"ఆయన దార్లో పడ్డాక అంతా చెబుతాలేరా!" అని హామీ యిచ్చింది.

(ఆంధ్రపత్రిక 26-8-88)